మీ సమస్యను
మీడియాకు చెప్పాలని ఉందా?

M.V.S.G.TILAK M.Sc., B.Ed.
Uttarandra Regional Bureau Chief
MANAM daily paper AP & TG
journalist.tilak03@gmail.com
Whatsapp : 9494524365
Please send ur news items,
we will publish it on our platform.
manamepaper.com

సంప్రదించండి



మనం
జనం కోసం అక్షర యజ్ఞం...

ఉమ్మడి
ఉత్తరాంధ్ర జిల్లాలు

బుధవారం | 10 | జూన్ | 2026 | పేజీలు : 10


# 36 ఏళ్ల స్టీల్ ప్లాంట్ చరిత్రలో ఇలాంటి ఘటన జరగలేదు

- బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం
- మృతుల కుటుంబాలకు
రూ.25 లక్షల పరిహారం ఒకరికి ప్లాంట్ లో ఉద్యోగం
- క్షతగాత్రులకు రూ.10 లక్షల తక్షణ సాయం
- వైద్య ఖర్చులన్నీ ప్లాంట్ యాజమాన్యమే భరిస్తుంది
- దర్యాప్తు. నివేదిక అనంతరం తదుపరి చర్యలు
- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

**విశాఖపట్నం , జూన్ 09 ( మనం న్యూస్ ) :** 'విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు మరణించడం, మరో ఆరుగురు తీవ్రంగా గాయపడటం అత్యంత బాధాకరం. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన


2వ పేజీలో

ప్రతి కార్మికుని కుటుంబానికి రూ. 25 లక్షల చొప్పున తక్షణ పరిహారంతోపాటు కుటుంబ సభ్యులలో ఒకరికి ప్లాంట్లో ఉద్యోగం కల్పిస్తాం. తీవ్రంగా గాయపడి ఆసుప్రతిలో చికిత్స పొందుతున్న కార్మికులకు ఒక్కొక్కరికీ రూ.10 లక్షల చొప్పున పరిహారం అందిస్తా మ'ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వెల్లడించారు. శాశ్వత ఉద్యోగులకు ఉద్యోగ విరమణ ప్రయోజనాల కింద రూ. 1.72 కోట్లు, కాంట్రాక్ట్ ఉద్యోగుల కు రూ. 45.75 లక్షలు అందిస్తామని, క్షతగా త్రుల వైద్యానికి అయ్యే మొత్తం ఖర్చులను ప్లాంట్ యాజ మాన్యమే పూర్తిగా భరిస్తుందని తెలిపారు. ప్రమాద ఘటనపై బొకారో స్టీల్ ప్లాంట్ కు

## ప్రమాద బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది : మంత్రి నారా లోకేష్


2వ పేజీలో

**విశాఖపట్నం , జూన్ 09 ( మనం న్యూస్ ) :** విశాఖ ఉక్కు కర్మాగారంలో జరిగిన దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు. .కేజిహెచ్ మార్చురీ వద్ద మృతుల కుటుంబాలను, వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతోన్న బాధితులను ఆయన మంగళ వారం పరామర్శించారు.అనంతరం స్టీల్ ప్లాంట్ లో ప్రమాద స్థలాన్ని పరిశీలించారు.ఈ పర్యటనలో కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, హోంమంత్రి మండల పూడి అనిత, విశాఖ పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి

## విశాఖ చేరుకున్న త్రీ మెన్ కమిటీ బృందం

**విశాఖపట్నం , జూన్ 09 ( మనం న్యూస్ ) :** విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై రంగంలోకి కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ నియమించిన త్రీ మెన్ కమిటీ. బృందం సభ్యులు ప్రియ రంజన్.డైరెక్టర్ ఇన్ ఛార్జ్ .జితేంద్ర కుమార్ , గోపాల్ సింగ్. బొకారో నుండి విశాఖపట్నం చేరుకున్నారు. మంగళవారం సాయంత్రం 4.30కి విశాఖ స్టీల్ ప్లాంట్‌లో త్రీ మెన్ కమిటీతో కేంద్ర ఉక్కు భారీపరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ భేటీ అయ్యారు. ప్రమాదానికి గల కారణాలు, క్షేత్రస్థాయి పరిస్థితులపై కమిటీ సభ్యులతో కేంద్ర ఉక్కు, భారీపరిశ్రమల శాఖ సహాయమంత్రి శ్రీనివాస వర్మ సమీక్షించారు.

## వర్జీనియా పొగాకు రైతులు, కంపెనీల సమన్వయంతోనే మార్కెట్‌కు స్థిరత్వం

- కొనుగోళ్లు వేగవంతం చేసేందుకు
సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ : మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు


3వ పేజీలో

**అమరావతి / విశాఖపట్నం , జూన్ 09 ( మనం న్యూస్ ) :** వర్జీనియా పొగాకు రైతులు ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయి సమన్వయంతో పనిచేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయు డు తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధరలు అందేలా, కొనుగోళ్లు వేగవంతం అయ్యేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు పరిస్థితిని

## బాధిత కుటుంబాలకు సహాయ సహకారాలు అందిస్తున్నాం : జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్


3వ పేజీలో

**విశాఖపట్నం , జూన్ 09 ( మనం న్యూస్ ) :** స్టీల్ ప్లాంట్‌లో జరిగిన దురదృష్టకర ఘటనలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు, గాయపడిన వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ తెలిపారు. మంగళవారం కేజీహెచ్ మార్చురీ వద్ద బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చిన క్రమంలో మీడియా తో మాట్లాడిన ఆయన పలు అంశాలను

## ప్రమాద బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది : మంత్రి నారా లోకేష్



**ఒకటి తరువాయి** శ్రీ భరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి లోకేష్, ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వం అత్యంత వేగంగా స్పందించిందన్నారు. ఘటన జరిగిన కొద్ది సేపటికే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి సమాచారం అందించడంతో పాటు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసి సహాయక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బాధిత కుటుంబాలకు కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి ప్రకటించిన రూ.25 లక్షల ఆర్థిక సాయాన్ని త్వరితగతిన అందించే చర్యలు జరుగుతున్నాయని వెల్లడించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తుందని స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారం సంక్షోభంలో ఉన్న సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వంతో నిరంతర చర్చలు జరిపి కర్మాగారానికి ఊరట కల్పించేలా చర్యలు తీసుకున్నామని మంత్రి గుర్తుచేశారు. కర్మాగార పరిరక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి గతంలోనూ, ప్రస్తుతం కూడా స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఈ ప్రమాదానికి సంబంధించిన కారణాలను నిర్ధారించేందుకు నిపుణుల కమిటీ సమగ్ర విచారణ నిర్వహిస్తోందని, కమిటీ నివేదిక వచ్చిన తర్వాతే తుది నిర్ణయాలు, వ్యాఖ్యలు చేయడం సముచితమని చెప్పారు. వాస్తవాలు బయటకు రాకముందే ఊహాగానాలు, అపోహలు సృష్టించడం సరికాదన్నారు. రాష్ట్రంలో ఎక్కడ ఏ ప్రమాదం జరిగినా ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా స్పందిస్తోందని, ప్రజల ప్రాణాలు, భద్రత ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి తెలిపారు. ప్రతి ఘటనను ముఖ్యమంత్రి పర్యవేక్షణలో ఉన్నతస్థాయిలో సమీక్షిస్తున్నామని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని మరింత బలోపేతం చేసి, గత వైభవాన్ని తిరిగి తీసుకురావడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి లోకేష్ అన్నారు. ఇప్పటికే కేంద్రం సహకారంతో భారీ ఆర్థిక ప్యాకేజీ, బకాయిల చెల్లింపులు, కార్యకలాపాల పునర్వ్యవస్థీకరణ వంటి చర్యల ద్వారా కర్మాగారం స్థిరీకరణ దిశగా ముందుకు సాగుతోందని వివరించారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా ప్రమాణాలను మరింత కట్టుదిట్టం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు.ఆర్థిక సహాయం ప్రకటించి చేతులు దులుపుకోవడం మా ఉద్దేశం కాదు. "కేవలం ఆర్థిక సహాయం ప్రకటించి చేతులు దులుపుకోవడం మా ఉద్దేశం కాదు. బాధిత కుటుంబాలకు దీర్ఘకాలిక భరోసా కల్పించడం, వారి పిల్లల భవిష్యత్తును ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత" అని మంత్రి స్పష్టం చేశారు. ప్రమాదానికి గల కారణాలపై పూర్తి స్థాయి దర్యాప్తు నిర్వహించేందుకు ముగ్గురు సీనియర్ నిపుణులతో కమిటీని కేంద్ర ప్రభుత్వం నియమించిందన్నారు. కమిటీ ప్రమాద స్థలాన్ని పరిశీలించి, కార్మికులతో మాట్లాడి, సాంకేతిక అంశాలను అధ్యయనం చేసి నివేదిక సమర్పిస్తుందని చెప్పారు. నివేదిక ఆధారంగా భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గాయపడిన కార్మికులను పరామర్శించిన సందర్భంగా, ఒక కార్మికుడు "మమ్మల్ని మాత్రమే కాదు, విశాఖ ఉక్కును కూడా కాపాడండి" అని కోరిన విషయాన్ని మంత్రి ప్రస్తావించారు. విశాఖ ఉక్కుపై కార్మికులకు ఉన్న అనుబంధం, భావోద్వేగం తనను కదిలించిందన్నారు. ఉత్తరాంధ్రలో భారీ పెట్టుబడులు, డేటా సెంటర్లు, ఐటీ, తయారీ పరిశ్రమలు వస్తున్న నేపథ్యంలో నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలకు భారీగా నిధులు కేటాయించిందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ, రీ-స్కిల్లింగ్ కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేస్తోందని తెలిపారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి పూర్వ వైభవం తీసుకురావడం, కార్మికుల సంక్షేమాన్ని కాపాడడం, బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ఎన్డీఏ ప్రభుత్వాల బాధ్యతగా భావిస్తున్నామని మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు.

## 36 ఏళ్ల స్టీల్ ప్లాంట్ చరిత్రలో ఇలాంటి ఘటన జరగలేదు

**ఒకటి తరువాయి** చెందిన త్రిసభ్య కమిటీ పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తుందని, కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంగళవారం ఉదయం విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద ఘటనా స్థలిని సందర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన, అలాగే తీవ్రంగా గాయపడ్డ ప్రతి ఒక్క కార్మికుడి కుటుంబానికి కూటమి ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుంది. బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగేలా చూస్తాం. స్టీల్ ప్లాంట్ ఉద్యోగుల పిల్లల చదువులు ప్రస్తుతం ఏ విధంగా సాగుతున్నాయో, మరణించిన కార్మికుల పిల్లల చదువులు కూడా అదే విధంగా కొనసాగుతాయి. ప్రమాదంలో మరణించిన ఉద్యోగికి పదవీ విరమణ వయస్సు వచ్చేంత వరకు, వారి కుటుంబ సభ్యులు ప్రస్తుతం ఉంటున్న స్టీల్ ప్లాంట్ క్వార్టర్లలోనే ఉచితంగా కొనసాగవచ్చు. ప్రస్తుతం స్టీల్ ప్లాంట్ టౌన్‌షిప్ బయట అద్దె ఇళ్లలో నివసిస్తున్న బాధిత కుటుంబాలు ఒకవేళ ప్లాంట్ క్వార్టర్లలోకి మారాలని అనుకుంటే, వారికి కూడా టౌన్‌షిప్ లోపల క్వార్టర్లను కేటాయిస్తారు. భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. ప్రమాద ఘటనపై త్రిసభ్య కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా తదుపరి నిర్ణయాలు ఉంటాయి. ఒక కోణంలో కాదు.. అన్ని వైపులా వివరాలు సేకరిస్తే విషయం తెలుస్తుంది. ఇలాటి దుర్ఘటనలు జరిగినప్పుడు బాధపడటం కాదు.. పునరావృతం కాకుండా చూడాలి.

### అన్ని కోణాల్లో లోతుగా దర్యాప్తు

ఘటన స్థలంలో కార్మికులతో మాట్లాడాను. సరైన భద్రతా ప్రమాణాలు పాటించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాంట్‌ను ఆధునీకరించడంలో యాజమాన్యం నిర్లక్ష్యం వహించిందని, దశాబ్దాల నాటి పాత పరికరాలు, యంత్రాలను మార్చకుండా వాడటం వల్లే ఇలాంటి పెను ప్రమాదాలు జరుగుతున్నాయని కార్మికులు ఆరోపిస్తున్నారు. నాకున్న సమాచారం ప్రకారం గత 36 ఏళ్ల స్టీల్ ప్లాంట్ కార్యాచరణ చరిత్రలో ద్రవ ఉక్కును మోసుకెళ్లే ల్యాడిల్ బకెట్ ఈ స్థాయిలో పేలిపోయి, ఇంత మంది ప్రాణాలు బలిగొన్న సంఘటన ఎప్పుడూ జరగ లేదు. గతంలో చిన్నపాటి లీకేజీలు, ఆక్సిజన్ ప్లాంట్‌లో ఇతర ప్రమాదాలు జరిగినప్పటికీ, ఒక ల్యాడిల్ బకెట్ పేలిపోవడం ఇదే మొదటిసారి అని నిపుణులు చెబు తున్నారు. చైనా, ఫ్రాన్స్ వంటి విదేశీ ఉక్కు కర్మాగారాల్లో గతంలో కొన్ని పారిశ్రామిక ప్రమాదాలు జరిగిన దాఖలాలు ఉన్నాయి. కానీ, అక్కడ కూడా ఇంత భారీ ఎత్తున మరుగుతున్న ద్రవ ఉక్కు బకెట్ పేలిపోయిన సంఘటనలు నమోదు కాలేదు. ఈ రకమైన పేలుడు అత్యంత అరుదైనది.త్రిసభ్య కమిటీ త్వరలోనే విశాఖపట్నం చేరుకుంటుంది. వారు ప్రమాదం జరిగిన స్టీల్ మెల్టింగ్ షాప్ విభాగాన్ని స్వయంగా పరిశీలిస్తారు. ద్రవ ఉక్కును తరలించే లాడెల్ బకెట్ యొక్క స్లైడ్ గేట్ తెరవకముందే అసలు పేలుడు ఎందుకు సంభవించింది? ఇది సాంకేతిక లోపమా? ఇకేదైనా సమస్య? ఇలా అన్ని కోణా ల్లో లోతుగా దర్యాప్తు చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తారు.



### కార్మికుల సమస్యలపై త్వరలోనే రౌండ్ టేబుల్ సమావేశం

స్టీల్ ప్లాంట్లో నెలకొన్న కార్మికుల సమస్యలు, యాజమాన్య లోపాలు, సాంకేతికపరమైన ఇబ్బందులను సమగ్రంగా తెలుసుకోవడానికి త్వరలోనే కార్మిక సంఘాల ప్రతినిధులతో స్వయంగా ఒక ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేస్తాను. ప్లాంట్‌లో అసలు ఏం జరుగుతుందో క్షేత్రస్థాయిలో పనిచేసే కార్మిక సంఘాల నేతలతో మాట్లాడతాను. నిరంతరం పర్యవేక్షించాల్సిన అధికారులు ఎక్కడ నిర్లక్ష్యం వహించారు? సేఫ్టీ ప్రోటోకాల్స్ ఎందుకు పాటించలేదు? అనే అంశాలను ఈ సమావేశంలో లోతుగా చర్చిస్తాను. విశాఖ ఉక్కు--ఆంధ్రుల హక్కు అనే నినాదం కేవలం మాటలకే పరిమితం కాదని, స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే ఉంచాలన్నదే తమ ప్రభుత్వ గట్టి ఆకాంక్ష. గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి సమర్థవంతమైన నాయకత్వంలో విశాఖ ఉక్కు కర్మాగారం ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగుతుందని, దానికి కావాల్సిన అన్ని రకాల కేంద్ర సహాయ సహకారాలు అందుతాయని తాము బలంగా ఆశిస్తున్నాము. గత వైసీపీ ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ చేయాలని ప్రయత్నిస్తే తాము రోడ్లపైకి వచ్చి కొట్లాడాము. విశాఖ స్టీల్ ప్లాంట్ అనేది ఎంతోమంది త్యాగాల పునాదులపై ఏర్పడింది. ఈ ప్లాంట్ సాధన కోసం జరిగిన ఉద్యమంలో కేవలం ఆంధ్రప్రదేశ్ వారే కాకుండా, తెలంగాణకు చెందిన ముగ్గురు వ్యక్తులు కూడా తమ ప్రాణాలను అర్పించారు. దీనికి ప్రాంతాలకు అతీతమైన చారిత్రక నేపథ్యం ఉంది. స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని కోరడానికి, ఆ సమస్యపై కేంద్ర పెద్దలతో మాట్లాడటానికి ఢిల్లీ వెళ్దాం రండి అని తాను పిలుపునిస్తే ఆ రోజు ఒక్కరు కూడా ముందుకు రాలేదు. కార్మిక సంఘాలు రాజకీయాలకు అతీతంగా పని చేసినప్పుడే కార్మికులకు నిజమైన న్యాయం జరుగుతుంది. విశాఖ ఉక్కు కర్మాగారం భవిష్యత్తులో అద్భుతంగా వర్ధిల్లాలని, మళ్లీ ఎన్నడూ ఇలాంటి ఘోరమైన ప్రమాదాలు జరగకూడదన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ , విశాఖ జిల్లా ఇంచార్జ్ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి , శాసనసభ్యులుపంచకర్ల రమేశ్ బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, సుందరపు విజయ్ కుమార్, విశాఖ డీసీసీబీ ఛైర్మన్ కోన తాతారావు, జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ పాల్గొన్నారు.

### సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో బాధితులకు పరామర్శ

స్టీల్ ప్లాంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడిన అనంతరం శ్రీ పవన్ కళ్యాణ్ విశాఖపట్నం సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో స్టీల్ ప్లాంట్ ప్రమాద ఘటనలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులు పైడిరాజు, సూరిబాబు, శ్రీనివాస్ లను పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరుని అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడారు. ఆసుపత్రిలో అందుతున్న చికిత్సకి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

# వర్జీనియా పొగాకు రైతులు, కంపెనీల సమన్వయంతోనే మార్కెట్‌కు స్థిరత్వం

**ఒకటి తరువాయి** సమీక్షిస్తూ కేంద్ర ప్రభుత్వం, పొగాకు బోర్డు ఉన్నతాధికారులతో నిరంతర సంప్రదింపుల వలన పొగాకు బోర్డు ఈడీ, చైర్మన్ లకు కేంద్ర ఉన్నతాధికారులు దిశానిర్దేశం చేయటంతో పొగాకు మార్కెట్ పరిస్థితులు, కొనుగోళ్ల పురోగతి, ఎగుమతుల స్థితిగతులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సోమవారం పొగాకు బోర్డు చైర్మన్ ఆధ్వర్యంలో రైతులు, కొనుగోలు సంస్థలతో ప్రత్యేక సమావేశం నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. రైతులు, కంపెనీల అభిప్రాయాలను సమగ్రంగా పరిశీలించి కొనుగోలు ప్రక్రియను మరింత సమర్థవంతం చేసేలా కార్యాచరణ రూపొందించినట్లు వివరించారు. అదే క్రమంలో పొగాకు బోర్డు చైర్మన్ మంగళవారం ఢిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి అరవింద్ శ్రీవాస్తవ్ తో పాటు సంబంధిత ఉన్నతాధికారులను కలుసుకుని వర్జీనియా పొగాకు రైతుల పరిస్థితిని వివరించినట్లు చెప్పారు. రైతుల సమస్యలపై సానుకూల దృక్పథంతో స్పందించాలని కోరినట్లు వెల్లడించారు.గత 15 రోజుల క్రితం మార్కెట్‌లో రోజుకు సుమారు 150 బేళ్ల స్థాయిలో మాత్రమే కొనుగోళ్లు జరిగేవని, ప్రభుత్వం తీసుకున్న చర్యలు, రైతులు, కంపెనీల మధ్య సమన్వయంతో ప్రస్తుతం ఇది సగటుగా 700 బేళ్లకు పెరిగిందని మంత్రి తెలిపారు. ఈ ధోరణి కొనసాగితే వచ్చే వారం రోజుల్లో రోజుకు 1000 నుంచి 1200 బేళ్ల వరకు కొనుగోళ్లు చేరుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. కంపెనీలు అవసరమైన గ్రేడ్ల వివరాలను సమావేశంలో తెలియజేశాయని, వాటి ఆధారంగా వారంవారీ కొనుగోలు లక్ష్యాలను నిర్దేశించినట్లు తెలిపారు. రైతులు అన్ని గ్రేడ్లను సమానంగా మార్కెట్‌కు తీసుకురావాలని సూచించారు. అన్ని గ్రేడ్ల సమగ్ర ప్రవాహం ఉంటే కొనుగోళ్లు మరింత సాఫీగా జరుగుతాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశంలో ఉత్పత్తి అయ్యే పొగాకులో 30 శాతం దేశీయ వినియోగానికి వెళ్లగా, 70 శాతం ఎగుమతులు జరుగుతున్నాయని మంత్రి వివరించారు. అంతర్జాతీయ పరిణామాలు, మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు, రవాణా సమస్యలు, షిప్పింగ్ కంటైనర్ల కొరత వంటి కారణాలతో ఎగుమతి రంగం ఒత్తిడిని ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. కంటైనర్ రవాణా ఖర్చు సుమారు 1600 డాలర్ల నుంచి 4000 డాలర్ల వరకు పెరిగినట్లు తెలిపారు. ఈ పరిస్థితుల్లో జీఎస్టీ భారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రానికి విజ్ఞప్తి చేశారని మంత్రి చెప్పారు. అలాగే ఎగుమతిదారులకు వడ్డీ రాయితీ కల్పించాలన్న ప్రతిపాదనపై కేంద్రం సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు. ఈ అంశంపై కేంద్ర వాణిజ్య శాఖతో కూడా చర్చలుకొనసాగనున్నాయని తెలిపారు. రైతులు, కంపెనీలు, ఎగుమతిదారులు ఒకే వేదికపై కలిసి పనిచేస్తేనే ప్రస్తుత సవాళ్లను అధిగమించగలమని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలను కాపాడడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

# బాధిత కుటుంబాలకు సహాయ సహకారాలు అందిస్తున్నాం : జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్

**ఒకటి తరువాయి** వివరించారు. 08వ తేదీ సాయంత్రం స్టీల్ మెల్ట్ షాప్-1లోని మెషిన్ నెం.2 వద్ద లాడిల్ బ్లాస్ట్ ఘటన జరగగా, విధుల్లో ఉన్న 8 మంది కార్మికులు మృతి చెందారని, మరో 6 మంది తీవ్రంగా గాయపడ్డారని పేర్కొన్నారు. వారిని వెంటనే కిమ్స్, సెవెన్ హిల్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు తరలించి అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురు బాధితులు ప్రమాదం నుంచి బయటపడ్డారని, సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురిలో ఒకరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని కలెక్టర్ తెలిపారు. మృతుల కుటుంబాలకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తున్నామని, ఇప్పటికే ఏడు మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించామని, మిగిలిన కుటుంబ సభ్యులు చేరుకున్న వెంటనే అన్ని న్యాయపరమైన ప్రక్రియలు పూర్తి చేసి మృతదేహాలను అప్పగిస్తామని చెప్పారు. బాధిత కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఆర్ఐఎన్ఎల్ తరపున ప్రకటించిన ఆర్థిక సహాయం, ఇతర సంక్షేమ ప్రయోజనాలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. టెర్మినల్ బెనిఫిట్స్‌తో పాటు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, పిల్లలకు ఉచిత విద్య, నివాస సదుపాయం కొనసాగింపు, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించే నిర్ణయాలను అమలు చేసే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఘటనకు గల కారణాలను తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం నియమించిన ముగ్గురు సభ్యుల విచారణ కమిటీ ఇప్పటికే విచారణ ప్రారంభించిందని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబాల అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, అంత్యక్రియలు, రవాణా, వైద్య చికిత్స, ఇతర అవసరాల కోసం జిల్లా యంత్రాంగం నిరంతరం అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ పేర్కొన్నారు. ఆయనతో పాటు జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, ఇతర అధికారులు పాల్గొన్నారు

# లక్ష్మీపురంలో రక్షిత మంచినీటి ట్యాంకుల క్లోరినేషన్



**చోడవరం , జూన్ 09 ( మనం న్యూస్ ) :** మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో పంచాయితీ కార్యదర్శి సూచనల మేరకు, మాజీ సర్పంచ్ శిరిసోళ్ల ఆది గణపతి నాయుడు ఆధ్వర్యంలో రక్షిత మంచినీటి ట్యాంకులను మంగళవారం క్లోరినేషన్ చేపట్టారు. స్థానిక శివాలయం కాలనీలో గల 90,000 లీటర్ల ఓవర్ హెడ్ ట్యాంకు, ఎస్సీ కాలనీలో గల 40,000 లీటర్ల ఓవర్ హెడ్ మంచినీటి ట్యాంక్ ను గ్రామంలోని యువకులు కొందరు బ్లీచింగ్ తో క్లోరినేషన్ చేశారు. మంచినీటి ట్యాంకుల క్లోరినేషన్ పట్ల మహిళలు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

### 10 వ తేదీ లోపు జిల్లా లోని అన్ని పాఠశాలల రెడీనెస్, సంసిద్ధత పై

# పూర్తి వివరాలతో జాబితా సిద్ధం చేయాలి : జిల్లా కలెక్టర్ నిషాంతి. టి

**ఏ ఎస్ ఆర్ జిల్లా పాడేరు , జూన్ 09 ( మనం న్యూస్ ) :** జిల్లాలోని గిరిజన సంక్షేమ, ప్రభుత్వ, మండల పరిషత్, కేజీబీవీ , గురుకుల పాఠశాలల 'స్కూల్ రెడీనెస్' పాఠశాలల సంసిద్ధత పై జిల్లా కలెక్టర్ నిషాంతి. టి, సంబంధిత శాఖల అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గిరిజన సంక్షేమ, ప్రభుత్వ, మండల పరిషత్, కేజీబీవీ, గురుకులం స్కూలుకు సంబంధించిన అధికారులతో ? మౌలిక వసతుల కల్పన, స్కూల్ సిద్ధతపై పాడేరు ఐటిడిఏ పివో ఆదిత్య వర్మ తో కలిసి సంయుక్తంగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న స్కూల్స్ వివరాలు, మండలాల వారీగా సంబంధిత అధ్యాపకులతో స్కూల్ రెడీనెస్ సర్టిఫికెట్లను తీసుకోవాలని, పూర్తికాని వాటిపై అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ?10వ తేదీ లోపు జాబితా సిద్ధం కావాలని, రాబోయే 10 వ తేదీ లోపు జిల్లాలో సంసిద్ధంగా ఉన్న పాఠశాలల పూర్తి వివరాలతో కూడిన సమగ్ర జాబితాను తయారు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పాఠశాలల్లో అందుబాటులో ఉన్న పూర్తిస్థాయి మౌలిక వసతుల వివరాలను, అలాగే ఇంకా అసంపూర్తిగా ఉన్న పనుల వివరాలను క్షేత్రస్థాయిలో ఉన్న సంబంధిత ఉపాధ్యాయుల నుండి తక్షణమే సేకరించాలని ఆదేశించారు.



నాణ్యతకు ప్రాధాన్యతపై విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి అన్ని వసతులు పూర్తి కావాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి(ఎఫ్ ఏసి) చెలయ్య , ఏపిసి ఎస్ ఎస్ ఏ సోమ నాయుడు, ఏపీడబ్ల్యూఓ అఖిల, సెక్టోరల్ అధికారి, ఏ ఎల్ ఎస్ కోఆర్డినేటర్ కూర్మారావు, వివిధ సంక్షేమ శాఖల అధికారులు, గురుకుల విద్యాలయాల సమన్వయకర్తలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించిన ఆర్జేడీ

**ఆనందపురం , జూన్ 09 ( మనం న్యూస్ ) :** ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) లక్ష్యాల సాధనలో ఒకటి, రెండు తరగతులు బోధించే ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని పాఠశాల విద్యా ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్జేడీ) బి. విజయభాస్కర్ అన్నారు. ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఆరు రోజుల "జ్ఞాన ప్రకాశ్ 3.0" ఎఫ్ఎల్ ఎన్ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన సందర్శించి శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రాథమిక స్థాయిలో పాఠశాలలకు కొత్తగా వచ్చే చిన్నారులకు మాతృభావంతో, ఓర్పుతో, సహనంతో బోధించాలని సూచించారు. ప్రతి విద్యార్థి పునాది అక్షరాస్యతను సాధించేలా కృషి చేయాలని, చదవడం, రాయడం, గణితంలోని చతుర్విధ ప్రక్రియల్లో నైపుణ్యం పెంపొందేలా బోధించి ఉన్నత తరగతుల్లో మెరుగైన ప్రతిభ కనబరిచేలా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ



సందర్భంగా శిక్షణలో భాగంగా ఉపాధ్యాయులు నేర్చుకున్న అంశాలపై ఆర్జేడీ విజయభాస్కర్ ఆరా తీశారు. టీచర్ హ్యాండ్‌బుక్ వినియోగం, నో బ్యాగ్ డే కార్యకలాపాలు, గణిత ఆటలు, నూతన పాఠ్యపుస్తకాల బోధనా విధానాలు, బోధన-అభ్యసన పరికరాల తయారీ తదితర అంశాలపై ఉపాధ్యాయులతో చర్చించారు. ఉపాధ్యాయులు శిక్షణ ద్వారా పొందిన జ్ఞానాన్ని విద్యార్థుల అభ్యాస పురోగతికి వినియోగిస్తామని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయుల సమాధానాలపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, శిక్షణ కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించబడుతోందని అభిప్రాయపడ్డారు. గత ఆరు రోజులుగా శిక్షణకు సహకరిస్తున్న డైట్ భీమునిపట్నం బృందం అందిస్తున్న సేవలను కూడా పరిశీలించారు. కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, అధ్యాపకులు అల్లావుద్దీన్, ఆనందరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. కామేశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారులు వి. జోగేంద్రనాథ్, కె. గంగరాజు, వేదిక ఇన్‌చార్జి మురళీమోహన్ పట్నాయక్, కేఆర్పీలు, డీఆర్పీలు పాల్గొన్నారు. వారి బోధనా నైపుణ్యాలను పరిశీలించిన ఆర్జేడీ విజయభాస్కర్ వారితో ముచ్చటించి అభినందనలు తెలిపారు.

# రైతులకు విత్తనాలు పంపిణీ



**ముంచంగి పుట్టు , జూన్ 09 ( మనం న్యూస్ ) :** వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ, రైతుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, ముంచంగిపుట్టు మండలం టీడీపీ అధ్యక్షురాలు కిల్లోసంధ్యఅన్నారు. మండల కేంద్రం లో రాబోయే వానాకాలం యాసంగి సాగును దృష్టిలో ఉంచుకుని, రాయితీపై స్థానిక రైతులకు నాణ్యమైన విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని . మన రైతన్నలకు ఎలాంటి ఇబ్బందులు రాకూడదనే ఉద్దేశంతోనే ఈ విత్తనలను కూటమి ప్రభుత్వం సకాలంలో పంపిణీ చేస్తోందని . రాబోయే రోజుల్లో రైతులకు మరింత మేలు జరిగేలా కొత్త పథకాలు తీసుకువస్తోం దన్నారు.రైతే దేశానికి వెన్నుముక అని కూటమి ప్రభుత్వం రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, నాణ్యమైన విత్తనాలు అందించి, మంచి దిగుబడులు సాధించడమే లక్ష్యం గా పనిచేస్తుందన్నారు. ప్రజాప్రతినిధులు తమకు సకాలంలో విత్తనాలు అందించడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. సకాలంలో విత్తనాలు అందడంతో సాగు పనులు వేగవంతం అవుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముంచంగిపుట్టు మండలం టీడీపీ ప్రధాన కార్యదర్శి కొంతేరి జగన్రాయ్, అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ రాణాసింగి నిలకంఠం పాత్రో, క్లస్టర్ ఇంచార్జ్ లు మజ్జి చిన్ని, బి రామారావు,వైస్ ఎంపీపీ సత్యనారాయణ, సిపిఎం నేత ఎం ఎం శ్రీను, మండల వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, మండల సోషల్ మీడియా కన్వినర్ చెట్టి నవీన్ కుమార్, యూనిట్ ఇంచార్జ్ కొండసీమ సింహాచలం,వెంగడ అక్షయ్ కుమార్, కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు

# కల్వర్టును పరిశీలించిన ఎమ్మెల్యే ఎన్ఈఆర్



**లావేరు , జూన్ 09 ( మనం న్యూస్ ) :** మండలం అదపాక నుంచి గుర్రాల పాలెం మీదగా పొందూరు వెళ్లే రహదారి ఇటీవల వర్షాలకు కల్వర్టు బాగా కుప్పకూలింది స్థానిక ప్రజల కోరిక మేరకు ఎమ్మెల్యే నడుకుదుటీ ఈశ్వరరావు మంగళవారం గండిపడిన ప్రదేశాన్ని పరిశీలించారు చాలా గ్రామాలకు వెళ్లే రహదారి దెబ్బతినడంతో వెంటనే సంబంధిత శాఖ అధికారులు రప్పించుకొని అక్కడ పరిస్థితులను ఎమ్మెల్యే వివరించారు దీంతో స్థానిక ప్రజలు కూటమి నాయకులు ఆనందం వ్యక్తం చేశారు సంబంధిత శాఖ అధికారులను రెండు రోజుల్లో మరమ్మత్తులు చేపట్టాలని ఆయన ఆదేశించారు

# అక్రమంగా మట్టి తరలింపు..అడ్డుకట్ట వేయలేని అధికారులు

## ఫోను చేసిన విలేకరులకు పిల్లి మీద ఎలక ఎలక మీద పిల్లి సమాధానం చెబుతున్న రెవెన్యూ యంత్రాంగం

**అనకాపల్లి / చీడికాడ , జూన్ 09 ( మనం న్యూస్ ) :** మండల కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న సంబంధిత అధికారులు స్పందించకపోవడంలో సర్వత్ర విమర్శలు వేళ్లువెత్తుతున్నాయి. మట్టి తరలించాలన్న పునాదుల్లో మట్టి నింపాలన్న ముందుగా అనుమతులు తీసుకోవాల్సిన నిబంధనలు ఉన్నప్పటికీ. మండల కేంద్రంలో ఎటువంటి అనుమతి లేకుండా పోలీస్ స్టేషన్ ఎదురు గుండా ట్రాక్టర్లతో దర్జాగా మట్టిని తరలించిన సంఘటన చోటు చేసుకుంది. అయినప్పటికీ రెవెన్యూ యంత్రాంగం స్పందించకపోవడంలో సర్వత్ర విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఈ విషయమై మనం దినపత్రిక ప్రతినిధి ఆర్ఐ కి ఫోన్ చేయగా, వీఆర్వో కు చెప్పాను అని చెప్పడం, సదరు విఆర్ఓకి విలేకరి ఫోన్ చేయగా నేను సెలవులో ఉన్నాను అని చెప్పడం, మరలా విలేఖరి ఆర్ ఐ కి ఫోన్ చేయగా ఇన్చార్జి విఆర్ఓ కి చెప్పాను వస్తున్నారు అని చెప్పడం, ఇన్చార్జి విఆర్ఓ రాకపోవడంతో మరల విలేకరి ఫోన్ చేయగా, ఆయన వేరేచోటకు వెళ్తున్నారు మరో విఆర్ఓ వస్తున్నారని చెప్పడం, ఆయన రాకపోతే ఎమ్మార్వో కు విలేఖరి ఫోన్ చేయగా ఆర్ ఐ కి చెప్పాను వస్తారు చర్యలు తీసుకుంటారు అని చెప్పడంలో గల ఆంతర్యం అంత చిక్కడం లేదు. ఒకరికి చెబితే ఒకరు పేరు మీద చెబుతూ వాహనాలను అడ్డుకోవడమే కాకుండా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఇలా తప్పుడు సమాచారం ఇస్తూ తప్పించుకోవడంపై పలు అనుమానాలు తావిస్తున్నాయి. దర్జాగా పోలీస్టేషన్ ఎదురుగుండా ఎటువంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న. పోలీసులు కానీ రెవెన్యూ యంత్రాంగం స్పందించకపోవడంలో ఆంతర్యం అంత చిక్కడం లేదు. ఈ విషయమై విలేకరులు ఫోను చేసిన రెవెన్యూ యంత్రాంగం ఒకరిపై ఒకరు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ అక్రమ రవాణాకు సహకరించారే కానీ చర్యలు తీసుకున్న సంఘటన కనిపించడం లేదు. దీన్ని బట్టి



చూస్తుంటే రెవెన్యూ యంత్రాంగం అక్రమార్కులకు సహకరిస్తున్నారని అభిప్రాయం తలెత్తుతోంది. మండలంలోని చోటామోటా నేతలు ఎవరు చెప్పినా ఏమి చేసినా పట్టించుకోవద్దని అధికారులకు చెప్పడంతో వారు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని పాత్రికేయులు ఫోన్ చేసిన స్పందించడం లేదని ఆరోపణలు లేకపోలేదు. నిబంధనలకు విరుద్ధంగా ఏ పనులు చేసినా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి బాహటంగా ప్రకటనలు చేస్తున్నప్పటికీ ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అధికారులు చోటామోటా నేతల ఫోన్లకు తలంచి చూసి చూడనట్లు వ్యవహరిస్తూ అక్రమ రవాణాలకు అక్రమ వ్యాపారాలకు సహకరిస్తున్నారనే విమర్శలు భారీగా వినిపిస్తున్నాయి. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

# స్టీల్ ప్లాంట్ బాధితులకు కోటి చొప్పున నష్టపరిహారం చెల్లించాలి!

## జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో అండగా బాధితులకు అండగా ఉంటాం! : మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్

**విశాఖపట్నం , జూన్ 09 ( మనం న్యూస్ ) :** విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని, తక్షణమే ఒక్కొక్కరికి కోటి రూపాయలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని మాజీ ఎమ్మెల్యే, దక్షిణ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త వాసుపల్లి గణేశ్ కుమార్ డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ లో జరిగిన అగ్నిప్రమాద బాధిత కుటుంబాలను మంగళవారం కేజీహెచ్ లో ఆయన పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను, వారి పిల్లలతో నేరుగా మాట్లాడి ప్రమాద స్థితిగతులతో పాటు చనిపోయిన వారి సాధరబాధలను అడిగి తెలుసుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు తామంతా అండగా నిలబడతామని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ ఈ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి పరిహారం ప్రకటించలేదు' అని వాసుపల్లి మండిపడ్డారు. బాధిత కుటుంబాలు ధైర్యంగా ఉండాలని, జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మీరు కోరుకునే విధంగా తామంతా అండగా నిలబడి ఉంటామని వాసుపల్లి స్పష్టం చేశారు. 'మృతుల పిల్లలకు ఆర్థికంగానూ, అన్ని రకాలుగా తమ వంతు సాయం చేస్తామన్నారు. మా ప్రభుత్వంలో ఎల్జీ పాలిమర్స్ ఘటనలో మృతిచెందిన కుటుంబాలకు రూ.కోటి చొప్పున ఇచ్చామన్నారు. ఇప్పటికే ఎనిమిది మంది చనిపోయారని, మరో ముగ్గురు సెవెన్ హిల్స్ హాస్పిటల్ లో ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నారన్నారు. మరి



కొంతమంది కిమ్స్ హాస్పిటల్ లో ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వెల్లడించారు. చనిపోయిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. అలాగే ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులు ఆరోగ్యకరంగా తిరిగి కోలుకోవాలని భగవంతుని ప్రార్థిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి రాజశేఖర్, లింగం శీను, గనగల రామరాజు, రేయ్యి డేవిడ్ రాజు, సనపల రవీంద్ర భరత్, బేవార మహేష్, దైవ కుమార్, వీటీ కృష్ణ కుమార్,కమల్ మనోహర,దక్షిణ వైఎస్ఆర్సిపి నాయకులు, పాల్గొన్నారు.

# స్టీల్ ప్లాంట్ ప్రమాదానికి నిర్లక్ష్యమే కారణం

**ప్రమాదానికి ప్లాంట్ యాజమాన్యం, ప్రభుత్వమే బాధ్యత వహించాలి : శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ**

**విశాఖపట్నం , జూన్ 09 ( మనం న్యూస్ ) :** విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన భారీ ప్రమాదం అత్యంత దురదృష్టకరం, హృదయవిదారకమని ఏపీ రాష్ట్ర శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, వైయస్సార్సీపీ రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం విశాఖ కింగ్ జార్జ్ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధితులను పరామర్శించిన వైయస్సార్సీపీ నేతలు... అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ ప్రమాదంలో ఇప్పటికే 8 మంది కార్మికులు మరణించగా, సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో 90 శాతం కాలిన గాయాలతో ఉన్న మరో ముగ్గురి పరిస్థితి అత్యంత విషమంగా ఉందని నేతలు తెలిపారు. కిమ్స్ ఆసుపత్రిలో 40 శాతం గాయాలతో ఇంకో ముగ్గురు చికిత్స పొందుతున్నారని వివరించారు. మృతుల కుటుంబాలకు వైయస్సార్సీపీ తరపున, పార్టీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి తరపున ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విశాఖ స్టీల్ ప్లాంట్‌ను తమ తాబేదార్లకు కట్టబెట్టాలనే కుట్రతోనే వ్యవహరిస్తోంది. స్టీల్ ప్లాంట్‌లో సమర్థులైన అధికారులను దొడ్డిదారిన బదిలీ చేయడం వల్లే అనుభవజ్ఞుల కొరత ఏర్పడి, ఈ తరహా భారీ ప్రమాదాలు జరుగుతున్నాయి. మిషనరీ నిర్వహణను పూర్తిగా గాలికొదిలేశారు. ఇప్పటికే దాదాపు 6 వేల మంది నుంచి 10 వేల మంది వరకు శాశ్వత, కాంట్రాక్ట్ ఉద్యోగులను అన్యాయంగా తొలగించారు. బలవంతపు వీఆర్ఎస్ చర్యలను ఆపాలి.గతంలో వైయస్ జగన్ ప్రభుత్వ హయాంలో ఎల్జీ పాలిమర్స్, ఫార్మా కంపెనీల ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులకు తక్షణమే రూ. 1 కోటి నష్టపరిహారం అందజేసి, ఆ తర్వాత కంపెనీల నుంచి రికవరీ చేశాం. ఇప్పుడు కూడా కార్మికుల డిమాండ్ మేరకు మృతి చెందిన ప్రతి కార్మిక కుటుంబానికి రూ. 1 కోటి పరిహారం ఇవ్వాలి. కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉ



ద్యోగం కల్పించాలి. ఈ డిమాండ్లు నెరవేరే వరకు వైయస్సార్సీపీ కార్మికుల పక్షాన ఉండి రాజీలేని పోరాటం చేస్తుంది. బాధితులను పరామర్శించడానికి వచ్చిన మంత్రి నారా లోకేష్.. సమస్యలపై ప్రశ్నించిన కార్మిక సంఘాల నేతలపై ఆగ్రహం వ్యక్తం చేయడం, రాజకీయం చేయడం దారుణం. నాడు ఎల్జీ పాలిమర్స్ ఘటన జరిగినప్పుడు వైయస్సార్సీపీ ప్రభుత్వంలో ఉన్న మేమంతా, సీఎస్‌తో సహా ఇక్కడే ఉండి బాధితులకు అండగా నిలబడ్డాం. కానీ నేడు అధికారంలో ఉన్నవారు కనీస ఓపిక, సహనం లేకుండా కార్మిక నేతలపై నోరు పారేసుకోవడం శోచనీయం.రేపు విశాఖకు మాజీ సీఎం స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధితులను ఓదార్చడానికి, వారికి అండగా నిలబడడానికి వైయస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్రేపు (బుధవారం) విశాఖపట్నం వస్తున్నారు. ఆయన స్వయంగా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించి, అనంతరం ప్లాంట్ యూనియన్ నేతలతో స్వయంగా మాట్లాడతారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కేవలం ఒక ఫ్యాక్టరీ కాదు.. అది ఆంధ్రుల ఆత్మగౌరవ ప్రతీక అని, కార్మికుల హక్కుల కోసం వైయస్సార్సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని బొత్స సత్యనారాయణ, కురసాల కన్నబాబు స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా కక్షసాధింపు రాజకీయాలు, ప్రైవేటీకరణ కుట్రలు పక్కనబెట్టి, ప్రమాదానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులకు రూ. 1 కోటి పరిహారం, శాశ్వత ఉద్యోగం ఇచ్చేంత వరకు.. అలాగే ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించే వరకు వైయస్సార్సీపీ అధ్యక్షులు వైయస్ జగన్ నాయకత్వంలో కార్మికుల పక్షాన నిలబడి రాజీలేని పోరాటం చేస్తామని" బొత్స సత్యనారాయణ కూటమి ప్రభుత్వాన్ని గట్టిగా హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి, జిల్లా పార్టీ కార్యాలయం పర్యవేక్షులు రవి రెడ్డి, పార్టీ నాయకులు కట్టుమూరి సతీష్ , మంత్రి రాజశేఖర్, పీవీ సురేష్ , రెయ్యి వెంకటరమణ, గుడివాడ లతిష్ , జీలకర్ర నాగేంద్ర, అంబటి శైలేష్, గోడాబా మనోజ్, రాయపురెడ్డి అనిల్ కుమార్, పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో కిషోర్ వికాస వేసవికాల శిక్షణ



**మాకవరపాలెం , జూన్ 09 ( మనం న్యూస్ ) :** అనకాపల్లి జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ ,సాధికారత అధికారి ,జిల్లా బాలల సంరక్షణ అధికారి వారి ఆదేశాలు మేరకు అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలంలో బూరుగుపాలెంలో అంగన్వాడి కేంద్ర పరిధిలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ నర్సీపట్నం,సీడీపీఓ ,సూపర్వైజర్,అంగన్వాడి వర్కర్ వారి ఆధ్వర్యంలో సెక్షన్-12"పిల్లల గ్రామసభ" పై "కిశోర వికాస వేసవికాలం శిక్షణ కార్యక్రమాలు"11 సంవత్సరం నుండి 18 సంవత్సరాల లోపు గల కౌమారదశ బాల బాలికలకు గ్రామస్థాయిలో సంఘాలను ఏర్పాటు చేసి వారంలో ప్రతి మంగళవారం, శుక్రవారం బాల బాలికలకు వీటి ద్వారా కౌమార దశలో గల పిల్లల సమస్యలు గురించి, వారి సక్రమ మార్గం వైపు తీసుకువెళ్లడమే దీని ముఖ్య ఉద్దేశము అంతేకాకుండా జీవన నైపుణ్యాలు, లైఫ్ స్కిల్స్, సెల్ఫ్ ఎవర్నెస్, ఆత్మవిశ్వాసన పెంచే స్వకియా అవగాహన, బాలల రక్షణ ,ఆరోగ్యము, విద్య, సాధికారత, లింగ వివక్షత, పోషకాహారము, వ్యక్తిగత పరిశుభ్రత చదువు యొక్క ప్రాధాన్యత మరియు కెరియర్ గురించి బాల వివాహం చేస్తే వచ్చే శిక్షలు సమస్యలు గురించి పూర్తి అవగాహన కల్పించడం దీని ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ప్రాజెక్ట్ సీడీపీఓ జి వి రమణ , సూపర్వైజర్ కె. సత్యవతి మేడం, అంగన్వాడి కార్యకర్తలు, డి సిపియు సామాజిక కార్యకర్త ఏ .రూప పాల్గొన్నారు.

## ప్రకటన హోర్డింగ్ స్థలానికి ఆసక్తిగల వారి నుంచి దరఖాస్తులు స్వీకరణ

**శ్రీకాకుళం , జూన్ 09 ( మనం న్యూస్ ) :** శ్రీకాకుళం పట్టణంలోని ఎమ్మార్వో/తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న పోలీస్ గెస్ట్ హౌస్ ప్రహరీ గోడకు ఆనుకుని ఉన్న ఖాళీ ప్రాంగణంలో 55 అడుగులు ఐ 13.5 అడుగుల పరిమాణంలో హోర్డింగ్ ఏర్పాటు చేసుకునేందుకు గాను ఆ స్థలాన్ని ఒక సంవత్సరం కాలపరిమితికి బహిరంగ వేలం ద్వారా కేటాయించనున్నట్లు శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు.ఈ వేలం ప్రక్రియలో పాల్గొనదలచిన ఆసక్తి గల వ్యక్తులు, సంస్థలు లేదా ప్రకటన ఏజెన్సీలు శ్రీకాకుళం జిల్లా పోలీసు కార్యాలయం (ఆర్టీసీ కాంప్లెక్స్ పక్కన)ను సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు.మరిన్ని వివరాలు కొరకు వెల్ఫేర్ ఆర్.ఐ.ఫోన్ 63099 90841,శ్రీకాకుళం జిల్లా పోలీసు కార్యాలయం లో (ఆర్టీసీ కాంప్లెక్స్ పక్కన) సంప్రదించగలరు.

# చోడవరం ఐటిఐ, దుర్గ కాలనీల వద్ద పారిశుద్ధ్య నిర్వహణ

**చోడవరం పంచాయతీ కార్యదర్శి జె.ఏ.వి. గంగాధర్**

**చోడవరం , జూన్ 09 ( మనం న్యూస్ ) :** ఈనెల 7వ తేదీన "అపారిశుధ్యం, అంటురోగాల నడుమ చోడవరం ఐటిఐ, దుర్గా కాలనీలు, రహదారులు వార్తకు స్పందనగా పంచాయితీ ఈవో జే.ఏ.వి గంగాధర్ ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ ఈవో గంగాధర్ మాట్లాడుతూ స్థానిక ఐటిఐ, దుర్గా కోలనీ, రెల్లివీధి నివాసిత ప్రాంతాల్లో మురుగు నీరు పోయే కాలవలు, గొట్టాలు చెత్తాచెదారం, పాత గుడ్డలు తో కప్పబడిపోయాయని అన్నారు. దీనికి కారణంగా వాడుక, మురుగునీరు పోయేందుకు దారి లేక రోడ్ల పైకి వచ్చేస్తుందని తెలిపారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరాలు పరిశుభ్రత నిత్యం పాటించాలని కోరారు. మురుగునీరు వాడుక నీరు పోయే మార్గాలు, డ్రైనేజీ కాలువల్లో చిరిగిపోయిన పారేసిన బట్టలు, ఇటువంటి చెత్త వేయరాదని





కాలనీవాసులకు తెలిపారు. ప్రజారోగ్యానికి, ... ప్రాథమిక చర్య పారిశుద్ధ్య నిర్వహణ అని ప్రజలందరూ తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అపారిశుద్ధ్యంతో అంటురోగాలు, వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందుతాయని కాబట్టి పారిశుద్ధ్య నిర్వహణలో ప్రజలు సహకరించాలన్నారు స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు, అధికారుల ఆదేశాలు, సహకారంతో చోడవరం అగ్నిమాపక శకటం, సిబ్బంది సహకారంతో ఐటిఐ, దుర్గా, రెల్లి కాలనీ ప్రాంతాలలో పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేపడుతున్నట్లు తెలియజేశారు ఈ కార్యక్రమంలో రైతు బజారు కాంట్రాక్టర్ పప్పు శ్రీను పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అత్యాధునిక సాంకేతికతతో "భూ" రీ సర్వే



**అనంతగిరి , జూన్ 09 ( మనం న్యూస్ ) :** మండలంలో గుమ్మ పంచాయతీ పరిధిలోని చీడివలస గ్రామంలో రీ-సర్వే ముమ్మరంగా సాగుతున్నాయి.వందేళ్ల తర్వాత భూ రికార్డుల ఆధునికీకరణ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం లో వ్యవసాయ,నివాస భూము లను డిజిటల్ పద్ధతి.సర్వేలో అత్యాధునిక డ్రోన్లు, డీజీపీస్ సాధనాలను ఉపయోగిస్తూ భూమికి కచ్చితమైన జియో-కోఆర్డినేట్స్‌తో కూడిన మ్యాప్‌లు,ప్రత్యేక గుర్తింపు నంబర్ (ఎల్పియం) కేటాయిస్తూ దశాబ్దాలుగా ఉన్న సరిహద్దు వివాదాలకు ,నకిలీ రికార్డుల సమస్యకు ఈ విధానం శాశ్వత పరి ష్కారం చూపుతుందని అధికా రులు తెలి పారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు ,గ్రామ రైతులు తదితర అధికారులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ తల్లి చల్లదనోత్సవంలో అలరించిన కోలాటం



**ఇచ్ఛాపురం , జూన్ 09 ( మనం న్యూస్ ):** శ్రీకాకుళం జిల్లా, ఇచ్ఛాపురం మండలం, కేసుపురంలో గ్రామదేవత శ్రీ ముత్యాలమ్మ తల్లి చల్లదనోత్సవం సందర్భంగా నిర్వహిం చిన మంగళవారాల వేడుకలు భక్తిశ్రద్ధలతో సాగాయి. ఈ సందర్భంగా శ్రీ ముత్యాలమ్మ తల్లి కోలాట బృందం ఆకట్టుకునే కోలాట నృత్య ప్రదర్శనతో అలరించింది.

చిన్నారులు లయబద్ధంగా పాటలకు అనుగుణంగా కోలాటం ఆడుతూ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. కోలాట గురువు తిప్పన.ధనుంజయ రెడ్డి ఆధ్వర్యంలో నృత్యకారిణులు ఏకరూప దుస్తులు ధరించి మండపంలో కోలాట ప్రదర్శన నిర్వహిం చారు. వారి నృత్య విన్యాసాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమం అనంతరం నృత్యకా రిణులు, నిర్వాహకులను గ్రామ పెద్దలు, స్థానికులు ప్రత్యేకంగా అభినందించారు.

# ప్రజా సమస్యలు పట్టించుకోని పాలకులపై సీపీఎం ఆగ్రహం

- నీటి కోసం కిలోమీటర్ల దూరం నడుస్తున్న గ్రామీణ మహిళలు
- ధ్వంసమైన రహదారులతో నిత్యం నరకయాతన పడుతున్న గ్రామస్తులు
- కనీస సౌకర్యాల కోసం సచివాలయం ఎదుట ఆందోళన
- మౌలిక వసతులు కల్పించే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరిక



**పోలవరం జిల్లా,చింతూరు, , జూన్ 09 ( మనం న్యూస్ ) :** చింతూరు మండల పరిధిలోని ఏజెన్సీ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కల్లేరు గ్రామ సచివాలయం ఎదుట సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన నిర్వహించారు. కల్లేరు, మధుగూరు, సూరన్నగొంది, స్టాపర్‌పేట గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి కొరత, రహదారుల దుస్థితి, మౌలిక వసతుల లేమిని నిరసనకారులు ప్రధానంగా ప్రస్తావించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సీసం సురేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కల్లేరు గ్రామంలో తాగునీటి సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోందని, రెండేళ్లుగా పైప్‌లైన్ దెబ్బతిని ప్రజలకు సరైన నీటి సరఫరా అందక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అదేవిధంగా కల్లేరు నుండి మధుగూరు వరకు ఉన్న రహదారి పూర్తిగా ధ్వంసమై ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారని, అత్యవసర పరిస్థితుల్లో కూడా వాహనాలు సక్రమంగా వెళ్లలేని స్థితి నెలకొందని అన్నారు. వెంటనే బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టి ప్రజల రాకపోకలకు అనుకూలమైన రహదారి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. స్టాపర్‌పేటలో మంచినీటి ట్యాంక్ నిర్మించి ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించాలన్నారు. గ్రామాల్లో రోడ్లు, తాగునీరు వంటి కనీస అవసరాలు కూడా అందకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రజల సమస్యల పరిష్కారం కోసం సీపీఎం ఎప్పటికప్పుడు ఉద్యమాల బాటలో ముందుకు సాగుతుందని, ప్రజల హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తుందని నాయకులు స్పష్టం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కల్లేరు గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాలకు తాగునీరు, రోడ్లు, ఇతర మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కారం సుబ్బారావు, సోడా రాఘవయ్య, సోడా రెడ్డి, రాములమ్మ, పూనెం బచ్చయ్య, సురేష్, సోడే చిన్నమి, కారం సీతయ్య, కారం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలి : సీపీఎం రాస్తారోకో

- పెట్రోల్, డీజిల్ ధరలతో సామాన్యుడి జేబుకు చిల్లు
- గ్యాస్ ధరల పెరుగుదలతో కుటుంబ బడ్జెట్ అస్తవ్యస్తం
- చింతూరులో సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో
- ధరలు తగ్గించకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరిక
- పెరిగిన ఇంధన ధరలపై ప్రజల్లో ఆందోళన




**పోలవరం జిల్లా (చింతూరు, మనం న్యూస్) , జూన్ 09 ( మనం న్యూస్ ) :** పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో సామాన్య ప్రజల జీవితం భారంగా మారిందని, వెంటనే ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం చింతూరు ప్రధాన కూడలి వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సీసం సురేష్ మాట్లాడుతూ, పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వల్ల కేవలం వాహనదారులకే కాకుండా ప్రతి కుటుంబంపై అదనపు భారం పడుతోందన్నారు. గ్రామాల్లో రైతులు పొలాలకు వెళ్లడానికి, పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించడానికి ఎక్కువ ఖర్చు భరించాల్సి వస్తోందని తెలిపారు. అలాగే సరుకు రవాణా ఛార్జీలు పెరగడంతో నిత్యావసర వస్తువుల ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయని అన్నారు. "ఒకప్పుడు బైక్‌లో వంద రూపాయల పెట్రోల్ పోస్తే కొన్ని రోజులు సరిపోయేది. ఇప్పుడు అదే వంద రూపాయలకు తక్కువ దూరమే వెళ్లగలుగుతున్నాం. గ్యాస్ సిలిండర్ ధర పెరగడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి" అని గ్రామీణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గుతున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నుల రూపంలో ప్రజలపై భారాలు మోపుతున్నాయని విమర్శించారు. ఎన్నికల సమయంలో ధరలు నియంత్రిస్తామని చెప్పిన ప్రభుత్వాలు ఇప్పుడు ప్రజలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించి ప్రజలకు ఉ పశమనం కల్పించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజలతో కలిసి మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని

# ఏఐ ప్లస్ స్మార్ట్ ఫోన్ లాంచ్‌ను ఓపెన్ ట్రయల్


## నోవా 2 నియో మరియు ప్రో రిటైల్




**విశాఖపట్నం , జూన్ 09 ( మనం న్యూస్ ) :** భారతీయ స్మార్ట్‌ఫోన్ పరిశ్రమలో తొలిసారిగా ఏఐ ప్లస్ స్మార్ట్ ఫోన్ నేడు ప్రకటించింది. విశ్వసనీయ వినియోగదారులకు విక్రయాలు ప్రారంభించే ముందే, భారతదేశం అంతటా ఉన్న సమీక్షకులు, కంటెంట్ నిర్మాతలు, పాత్రికేయులు మరియు సాంకేతిక సమాజ సభ్యులకు తన రాబోయే నోవా 2 నియో మరియు నోవా 2 ప్రో స్మార్ట్‌ఫోన్‌లను పంపిస్తుందని ఎటువంటి పరిమితులు లేకుండా పరికరాలను విమర్శించి సమీక్షించడానికి. లాంచ్ ఈవెంట్‌ల చుట్టూ నిర్మించిన ఒక పరిశ్రమలో ఏఐ ప్లస్ స్మార్ట్ ఫోన్ భిన్నమైన మార్గాన్ని ఎంచుకుంటోంది. ప్రచారానికి ముందు సంభాషణ, విక్రయానికి ముందు అభిప్రాయం మరియు మార్కెటింగ్‌కు ముందు వినియోగదారులు. ఉత్పత్తి లాంచ్‌లు తరచుగా జాగ్రత్తగా నియంత్రించిన కథనాలతో కూడి ఉండే ఈ సమయంలో, ఏ ఐ ప్లస్ బిన్నమైన విధానాన్ని అనుసరిస్తోంది. లాంచ్ రోజు మార్కెటింగ్‌కు ముందు వినియోగదారుల ప్రయోజనాలను ప్రాధాన్యత ఇవ్వడం. మాకు ధృవీకరణ అవసరం లేదు. వినియోగదారుల ప్రయోజనాల కోసం నిష్పక్షపాతమైన అభిప్రాయం కావాలి అని ఏఐ ప్లస్ స్మార్ట్ ఫోన్, నెక్స్ట్ క్వాంటం షిఫ్ట్ టెక్నాలజీస్ హెడ్ మాధవ్ సేథ్ అన్నారు. ఎటువంటి నిషేధం ఉండదు, సమీక్షా మార్గదర్శకాలు ఉండవు, ముందుగా రాసిన సందేశాలు ఉండవు మరియు ఎంపిక చేసిన లాంచ్ అనుభవాలు ఉండవు. అన్నింటికన్నా ముఖ్యంగా, సమీక్షకులకు తమ అభిప్రాయాన్ని పంచుకోవడానికి ఏడు రోజులు కిటికీ దొరికే వరకు పరికరాలు విక్రయానికి రావు. హార్డ్‌వేర్ మరియు సాఫ్ట్‌వేర్ పనితీరు నుండి కెమెరాలు, బ్యాటరీ జీవితకాలం, డేటా బదిలీ, విశ్వసనీయత మరియు మొత్తం వినియోగదారు అనుభవం వరకు పరికరాల ప్రతి అంశాన్ని పరీక్షించడానికి సమీక్షకులను ప్రోత్సహిస్తున్నారు అని చెప్పారు.

# మహిళల భద్రత, సైబర్ నేరాలు, గంజాయి నిర్మూలనపై చర్యలు : విశాఖ రేంజ్ ఐజి గోపీనాథ్ జట్టి

**విశాఖపట్నం , జూన్ 09 ( మనం న్యూస్ ) :** విశాఖ రేంజ్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు మరింత పారదర్శకమైన, వేగవంతమైన పోలీస్ సేవలను అందించడమే ధ్యేయంగా విశాఖ ఐజి పి గోపీనాథ్ జట్టి, తన కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఒక ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ వర్చువల్ సమావేశంలో రేంజ్ పరిధిలోని ఐదు జిల్లాల ఎస్పీలు అమిత్ బర్దర్, తుహిన్ సిన్హా, దామోదర్, మహేశ్వర రెడ్డి, మాధవరెడ్డి, సబ్ డివిజన్ అధికారులు స్టేషన్ హౌస్ అధికారులు పాల్గొన్నారు. మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత: మహిళలపై జరిగే నేరాలకు సంబంధించిన కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. మహిళల రక్షణ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. దీర్ఘకాలిక కేసుల పరిష్కారం: 31.12.2023 కంటే ముందు నమోదై, ఇప్పటికీ దర్యాప్తులో ఉన్న కేసుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కేసుల ఆలస్యానికి గల కారణాలను విశ్లేషించి, వాటిని త్వరితగతిన ముగించాలని సూచించారు. సైబర్ నేరాలపై ఉక్కుపాదం:ఒక కోటి రూపాయలకు పైగా నష్టం వాటిల్లిన పెద్ద సైబర్ మోసాలు మరియు 'డిజిటల్ అరెస్ట్' కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం హోల్డ్ చేసిన సొమ్మును బాధితులకు సకాలంలో రీఫండ్ చేయించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు.నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ లో పెండింగ్‌లో ఉన్న ?10 లక్షలు మరియు అంతకంటే ఎక్కువ విలువైన పిటిషన్లపై కేసులను నమోదుచేసి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సైబర్ మోశాలలో భాదితులు పోగొట్టుకొని ఫ్రీజ్ అయిన డబ్బులను ఆంధ్రప్రదేశ్ లో




కొత్తగా పైలట్ ప్రాజెక్టు క్రింద అమలు చేస్తున్న సిస్టమ్ ద్వారా కోర్టు ఆర్డర్ లేకుండానే అప్పగించుటకు చర్యలు తీసుకొమ్మని ఆదేశించారు. సైబర్ మోశాలకు సంబందించి డిజిటల్ బ్యాంకింగ్ సర్వీసెస్ నిలుపుదల మొదలగు పిర్యాదులను నూతనంగా ప్రవేశపెట్టిన సిస్టమ్ ద్వారా పరిస్కరించమని ఆదేశాలు జారీ చేశారు.సోషల్ మీడియా నేరాల అదుపు సోషల్ మీడియా ద్వారా సమాజంలో అశాంతి రేకెత్తించేలా ప్రవర్తించే వారిపై, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వివాదాస్పద కేసులపై కఠినంగా వ్యవహరించాలన్నారు. తరచు నేరాలకు పాల్పడే వారిని నేరస్థులను గుర్తించి, వారిపై హిస్టరీ షీట్లు తెరవాలని స్పష్టం చేశారు. గంజాయి, మత్తుపదార్థాల నిర్మూలన అక్రమ గంజాయి రవాణా వ్యాపారం చేసే 15 మంది నేరస్తులకి చెందిన: 9,45,10,321/-రూపాయల ఆస్తులు స్వాధీనం చేసుకోవడం జరిగినది. గంజాయి అక్రమ రవాణాలో పాల్గొంటున్న వ్యక్తుల ఆస్తులను గుర్తించి, ప్రజల సహకారంతో సమగ్ర సమాచారం సేకరించాల్సిన అవసరాన్ని తెలియజేశారు.పదే పదే నేరాలకు పాల్పడుతున్న వారిపై 1942 మంది గంజాయి నేరస్తుల కదలికల మీద నిఘా కోసం హిస్టరీ షీట్స్ తెరవడం జరిగినది. మరియు 127 మంది ముద్దాయి ల మీద పి ఐ టి ఎన్ డి పి ఎస్ చట్టం ప్రయోగించడానికి ప్రతిపాదించి 39 మందిని జైల్ కి పంపడం జరిగినది. గంజాయి కేసులో నిందితులుగా ఉ ండి తప్పించుకుని తిరుగుతున్న ముద్దాయిలను త్వరితగతిన అరెస్టు చేయమని స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడమైనది. చాలా కాలంగా పెండింగు లో ఉన్న కేసులు ను త్వరగా దర్యాప్తు చేసి కోర్టు లో చార్జి షీట్ లను దాఖలు చేయమమని ఆదేశాలు ఇవ్వడమైనది.గంజాయి నిర్మూలన కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'సంకల్పం 2.0' (సంకల్పం/ అభ్యుదయం, చైతన్యం 2.0) కార్యక్రమం అమలు తీరును సమీక్షించి, క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. గ్రామాలలో, విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు, ర్యాలీలు, ప్రతిజ్ఞలు నిర్వహించి, గ్రామాలను "డ్రగ్ రహిత గ్రామాలు" గా ప్రకటించే దిశగా ప్రతీ పోలీస్ స్టేషన్ కృషి చేసి క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

**6. మెడికో లీగల్ కేసులు:**

మెడ్‌లీపిఆర్ వ్యవస్థ వినియోగంలో పోలీస్ అధికారులు ఎదుర్కొంటున్న సాంకేతిక పరమైన ఇబ్బందులు, స్టేషన్ల వారీగా ఉన్న సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి తగిన సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఐజీ గోపీనాథ్ జట్టి మాట్లాడుతూ, పోలీస్ శాఖ ప్రతిష్టను పెంపొందించేలా ప్రతి ఒక్క అధికారి బాధ్యతాయుతంగా, ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేయాలని పిలుపునిచ్చారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అవలంబిస్తూనే, నేరగాళ్ల పట్ల కఠినంగా వ్యవహరించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో విశాఖ రేంజ్‌ను రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలపాలని అధికారులను ఆదేశించారు.

# నేడు మోస్తరు వర్షాలు

**అమరావతి , జూన్ 09 ( మనం న్యూస్ ) :** రాష్ట్రంలో బుధవారం నాడు అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. అల్లూరి సీతారామరాజు, పశ్చిమగోదావరి, ఏలూరు, గుంటూరు, మార్కాపురం, ప్రకాశం, ఎస్పిఎస్ఆర్ నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, వైఎస్ఆర్ కడప, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిగతా జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. ఆకస్మికంగా ఈదురుగాలులు, ఉరుములతో వర్షం పడే సమయంలో ప్రజలు చెట్ల కింద, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్స్ కింద నిలబడొద్దని సూచించారు. పొలాల్లో పనిచేసే రైతులు, పశుకాపరులు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఆకాశం మేఘావృతమై ఉరుములు వినిపించిన వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. మరోవైపు విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, కాకినాడ, బిఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 41 నుంచి 42 డిగ్రీల మధ్య, శ్రీకాకుళం, అనకాపల్లి, కృష్ణా, ఎన్టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 40 నుంచి 41 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో 42.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు పేర్కొన్నారు.

# హైవేపై రోడ్డు ప్రమాదం



**ఆనందపురం , జూన్ 09 ( మనం న్యూస్ ) :** ఆనందపురం హైవే మిందివానిపాలెం టీ టైమ్ ఎదురుగా ఘటన లారీ వెనుక బైక్ ఢీకొన్న ఘటన. బైక్ నడుపుతున్న వ్యక్తికి తీవ్ర తలగాయం. ఘటనాస్థలంలోనే వ్యక్తి మృతి చెందినట్లు సమాచారం ప్రమాదంపై పోలీసులు విచారణ ప్రారంభం మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. ఆనందపురం ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

# కండివరం గ్రామంలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం

**అనకాపల్లి / చీడికాడ , జూన్ 09 ( మనం న్యూస్ ) :** అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం కండివరం గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం (కె వి కె), కొండెంపూడి ఆధ్వర్యంలో "ఖేత్ బచావో అభియాన్" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేవీకే కొండెంపూడి సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి డా. ఎన్. రాజకుమార్, డా. ఎన్. కిశోర్ కుమార్, డా. ఎన్. సత్తిబాబు పాల్గొన్నారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ( ఆర్ ఏ ఆర్ ఎస్), అనకాపల్లి నుండి డా. చంద్రశేఖర్, డా. డి. ఉమా మహేశ్వరరావు, డి ఆర్ సి తులసీమణి వనరుల వ్యక్తులుగా హాజరై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ అధికారి కృష్ణవేణి, రైతు సాధికార సంస్థ సభ్యులు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.కార్యక్రమంలో భాగంగా ఖేత్ బచావో అభియాన్ యొక్క ముఖ్య ఉద్దేశ్యాలైన నేల ఆరోగ్య పరిరక్షణ, సమతుల్య పోషక నిర్వహణ, సేంద్రియ పదార్థాల వినియోగం మరియు సుస్థిర వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.డా. ఎన్. రాజకుమార్ మాట్లాడుతూ, వ్యవసాయ భూములలో నేల పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం చేయడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవడంతో పాటు సాగు ఖర్చులను తగ్గించవచ్చని తెలిపారు. నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం ద్వారా అధిక దిగుబడులు




సాధించవచ్చని వివరించారు.డా. ఎన్. కిశోర్ కుమార్ మాట్లాడుతూ, పంట అవసరాలకు అనుగుణంగా నత్రజని, భాస్వరం, పొటాష్ మరియు సూక్ష్మ పోషకాల సమతుల్య వినియోగం అత్యంత అవసరమని తెలిపారు. రైతులు నేల పరీక్షా నివేదికలను ఆధారంగా చేసుకుని పోషక నిర్వహణ చేపట్టాలని సూచించారు.డా. ఎన్. సతీబాబు మాట్లాడుతూ, పంట అవశేషాలను కాల్చకుండా వాటిని భూమిలో కలపడం, పచ్చి ఎరువులు మరియు సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచడం ద్వారా నేల జీవక్రియలు మెరుగుపడతాయని వివరించారు.

డా. చంద్రశేఖర్ మాట్లాడుతూ, నేలలో సేంద్రియ కార్బన్ శాతాన్ని పెంచడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యం, పోషకాల లభ్యత మెరుగుపడి పంటలు ఆరోగ్యంగా పెరుగుతాయని తెలిపారు.డా. డి. ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ, సమీకృత పోషక నిర్వహణ పద్ధతులను అవలంబించడం ద్వారా రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, దీర్ఘకాలికంగా నేల సారాన్ని సంరక్షించవచ్చని రైతులకు సూచించారు.వ్యవసాయ అధికారి కృష్ణవేణి మాట్లాడుతూ, రైతులు నేల పరీక్షలు చేయించుకొని, శాస్త్రవేత్తల సూచనల మేరకు పోషక నిర్వహణ చేపట్టాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో రైతులతో శాస్త్రవేత్తలు ప్రత్యక్షంగా చర్చించి, నేల ఆరోగ్యం, పోషక నిర్వహణ మరియు సుస్థిర వ్యవసాయంపై వారి సందేహాలను నివృత్తి చేశారు.

# భూదృశ్య పునరుద్ధరణకు ఒడిశా, ఏపీ సమాజాలు ఆదర్శం


**విశాఖపట్నం , జూన్ 09 ( మనం న్యూస్ ) :** భూమి, నీరు, అటవీ వనరులను సమగ్రంగా నిర్వహించడం ద్వారా ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లోని సమాజాలు భూదృశ్య పునరుద్ధరణలో ఆదర్శంగా నిలుస్తున్నాయని తాజా విధాన పత్రం వెల్లడించింది. సోషల్ సైన్స్ ఓపెన్ ఆర్కైవ్ (SocArXiv)లో విడుదలైన 'ది సెంట్రాలిటీ ఆఫ్ ఏరియా - బేస్డ్ అప్రోచెస్ ఇన్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్' పత్రం ఈ విషయాన్ని పేర్కొంది. దేశంలో సుమారు 30 శాతం భూమి క్షీణతకు గురవగా, జీవవైవిధ్య నష్టం, వాతావరణ మార్పుల ప్రభావం సహజ వనరులపై ఒత్తిడిని పెంచుతున్నాయని నివేదిక తెలిపింది. ఈ పరిస్థితుల్లో ప్రాంతాధారిత విధానాలు సమర్థవంతమైన పరిష్కారంగా నిలుస్తాయని సూచించింది. ఒడిశాలోని కేయోంజర్‌లో WOSCA, కోరాపుట్‌లో WASSAN సంస్థలు స్థానిక సమాజాలు, ప్రభుత్వ శాఖలతో కలిసి భూదృశ్య ప్రణాళికలు అమలు చేశాయి. దీంతో భూగర్భ జలమట్టాలు పెరగడం, మట్టిలో తేమ మెరుగుపడటం, పంట దిగుబడులు అధికమవడం వంటి ఫలితాలు సాధ్యమయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో సమాజ నిర్వహిత సహజ వ్యవసాయ కార్యక్రమం (CMNF) ద్వారా 10 లక్షలకు పైగా రైతులు, సుమారు 5 లక్షల హెక్టార్ల భూమి పరిధిలో సహజ వ్యవసాయం అమలవుతోంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద సహజ వ్యవసాయ కార్యక్రమంగా గుర్తింపు పొందింది. సమాజాల భాగస్వామ్యం, డేటా ఆధారిత ప్రణాళిక, మిశ్రమ ఆర్థిక నమూనాలు, విధానాలు-అమలు




మధ్య సమన్వయం భూదృశ్య పునరుద్ధరణకు కీలకమని పత్రం స్పష్టం చేసింది. సహజ వనరుల పరిరక్షణలో ప్రాంతాధారిత విధానాలను కేంద్రంగా తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించింది.



## సింహాచలంలో ఘనంగా మూడవ రోజు యోగాభ్యాసం



**సింహాచలం , జూన్ 09 ( మనం న్యూస్ ) :** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని, శ్రీ శ్రీ శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగా శిక్షణ కార్యక్రమం మంగళవారం మూడవ రోజుకు చేరుకుంది. దేవస్థానం కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకటరావు పర్యవేక్షణలో కొండపై జరిగిన ఈ కార్యక్రమంలో దేవస్థాన ఉద్యోగులు, అర్చకులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. యోగా శిక్షకుల మార్గదర్శకత్వంలో పాల్గొన్న వారంతా వివిధ యోగాసనాలు, ప్రాణాయామాలను అభ్యసించారు. శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కోసం నిత్యం యోగా సాధన చేయాలని ఈ సందర్భంగా అధికారులు సూచించారు. జూన్ 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈఓ పిలుపునిచ్చారు.



## 15 రోజుల్లో నిధి పేరోల్‌లో ఉద్యోగుల నమోదు

**అమరావతి , జూన్ 09 ( మనం న్యూస్ ) :**అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు తమ పరిధిలోని సంస్థల్లో నిధి పేరోల్ అప్లికేషన్‌లో మైగ్రేషన్, ఆన్‌బోర్డింగ్ ప్రక్రియను 15 రోజుల్లోగా పూర్తిచేయాలని ఆర్థికశాఖ కార్యదర్శి వడరేవు వినయ్ చంద్ ఆదేశించారు. సమస్యలున్న శాఖలు వెంటనే ఆర్థికశాఖకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఈ మేరకు ఆయన మంగళవారం సర్క్యులర్ జారీ చేశారు. కాంట్రాక్ట్, పార్ట్‌టైమ్, ఇతర తాత్కాలిక ఉద్యోగులకు వేతనాలు సకాలంలో అందేలా అన్ని శాఖలు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. నిధి పేరోల్ అప్లికేషన్‌లో అన్ని కాంట్రాక్ట్, పార్ట్‌టైమ్, తాత్కాలిక ఉద్యోగుల వివరాలను నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఇప్పటికే పలుమార్లు ఆదేశాలు జారీ చేసినప్పటికీ, కొన్ని శాఖలు ఆ ప్రక్రియను పూర్తి చేయలేదని ప్రభుత్వం గుర్తించింది. పోస్టుల కొనసాగింపునకు సంబంధించిన ఉత్తర్వులు లేకపోవడం, మంజూరు ఉత్తర్వుల ప్రతులు అందుబాటులో లేకపోవడం, రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రానికి కేటాయించిన పోస్టుల సంఖ్యపై స్పష్టత లేకపోవడం వంటి కారణాలతో ప్రక్రియ ఆలస్యమవుతోందని పేర్కొంది. ఈ సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత శాఖాధిపతులు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించింది. మూడు నెలలుగా కొనసాగుతున్న ఈ జాప్యం వల్ల కాంట్రాక్ట్, పార్ట్‌టైమ్ ఉద్యోగులు తమకు రావాల్సిన వేతనాలకు దూరమవుతున్నారని, ఇది ప్రభుత్వ దృష్టిలో ఆందోళనకరమైన అంశమని సర్క్యులర్‌లో పేర్కొన్నారు.


## విద్యార్థిని మాధురికి అండగా చిన్న శ్రీను...!

### ఇంటర్ విద్య కోసం రూ.1.10 లక్షల ఫీజు చెల్లింపు



**ఆనందపురం , జూన్ 09 ( మనం న్యూస్ ) :** భీమిలి నియోజకవర్గం పద్మనాభం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త దివంగత కంటుబొతు శ్రీను ప్రమాదవశాత్తు మృతి చెందిన విషయం తెలిసిందే. వారి కుటుంబ పరిస్థితిని గుర్తించిన విజయనగరం జిల్లా జడ్పీ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి వారి కుమార్తె కంటుబొతు మాధురి విద్యాభ్యాసానికి అండగా నిలిచారు. మాధురిని ఆనందపురం మండలం బోయపాలెంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్య కోసం చేర్పించడమే కాకుండా, ఆమె విద్యకు అవసరమైన రూ.1.10 లక్షల ఫీజును స్వయంగా చెల్లించారు. ఈ నేపథ్యంలో మంగళవారం మాధురి, ఆమె తల్లి చిన్న శ్రీనును, ఆయన కుమార్తె మజ్జి సిరి సహస్ర (సిరమ్మ)ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చిన్న శ్రీను మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు కోసం తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని, మాధురి ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పద్మనాభం ఎంపీపీ కంటుబొతు రాంబాబు, పద్మనాభం సర్పంచ్ తాలాడ పద్మనాభం, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పరదేశమ్మ చల్లని చూపు కోసం పోటెత్తిన భక్తులు..గరిసింగిలో వైభవంగా అమ్మవారి పండగ



**దేవరాపల్లి , జూన్ 09 ( మనం న్యూస్ ) :** మండలంలోని గరిసింగి గ్రామంలో వెలసిన గ్రామదేవత శ్రీ పరదేశమ్మ తల్లి పండగ మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కర్ రావు, మండల పార్టీ అధ్యక్షులు పెద్దాడ వెంకటరమణ, రైవాడ ప్రాజెక్టు చైర్మన్ పోతల పాత్రునాయుడు, మండల తెలుగు యువత అధ్యక్షుడు చిటిమరెడ్డి నాయుడు, గ్రామ శాఖ అధ్యక్షులు అప్పల నాయుడు, కోఆపరేటివ్ డైరెక్టర్ అల్లం విశ్వనాథం తదితర కూటమి నాయకులు హాజరయ్యారు .వేకువ జాము నుంచే మహిళలు బోనాలతో, పొంగళ్లతో ఆలయానికి పోటెత్తారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.మండల మాజీ సెక్రెటరీ శరకనా సూర్యనారాయణ విచ్చేసిన నాయకులకు శాలువాలతో ఘనంగా సత్కరించారు.రాత్రి కోలాటం, భజన కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పండగ ఏర్పాట్లు ఘనంగా జరిగాయి. పోలీసు శాఖ తగిన బందోబస్తు ఏర్పాటు చేసింది.

## ముగిసిన సౌర విద్యుత్ సాంకేతిక శిక్షణ



**భీమునిపట్నం , జూన్ 09 ( మనం న్యూస్ ) :** వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో ఆస్ట్రేలియన్ కాన్సులేట్-జనరల్ సహకారంతో మహిళలను సౌర విద్యుత్ సాంకేతిక రంగంలో నైపుణ్యం కలిగిన వారిగా తీర్చిదిద్దే లక్ష్యంతో నిర్వహించిన సోలార్ పీవీ టెక్నాలజీ ట్రైనింగ్ విజయవంతంగా ముగిసింది. భీమిలి చిన్న బజార్‌లోని జి.వి.ఎం.సి హాల్‌లో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో మొత్తం 47 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం 14 రోజుల పాటు కొనసాగింది. శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా నిర్వహించిన సభలో వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ బొల్లినేని కీర్తి పాల్గొని, మహిళలు సౌర విద్యుత్ సాంకేతిక పరిజ్ఞానాన్ని అభ్యసించడం ద్వారా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని సూచించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లు మరియు సోలార్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎడ్యుకేట్ డైరెక్టర్ విజయ్ మాట్లాడుతూ, సౌర విద్యుత్ రంగంలో మహిళలకు మంచి భవిష్యత్తు అవకాశాలు ఉన్నాయని, శిక్షణలో నేర్చుకున్న సౌర ప్యానెల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆచరణలో ఉపయోగించి స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని సూచించారు. అదేవిధంగా మాజీ కార్పొరేటర్ గంటా నూకరాజు మాట్లాడుతూ సౌర విద్యుత్ రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని, మహిళలు ఈ శిక్షణ ద్వారా పొందిన జ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును మరింత మెరుగుపరుచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవ్య మహిళా మండలి సమన్వయకర్తలు పీసీ డి. వరలక్ష్మి, కె.వి. పార్వతి, ఎన్. దివ్య, టి. శర్మిల, కె. భవాని పాల్గొని శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్ మరణాలు ప్రభుత్వ హత్యలే

- మృతుల కుటుంబాలకు కోటి పరిహారం ఇవ్వాల్సిందే : మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ స్పష్టీకరణ
- విశాఖపట్నంలోని వైఎస్సార్సీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్
- తప్పుల్ని ప్రశ్నిస్తే లోకేష్ కు ఫ్రస్టేషన్ ఎందుకు ?
- పరామర్శకు వచ్చి ఎందుకంత అసహనం ?
- సూటిగా ప్రశ్నించిన గుడివాడ అమర్నాథ్
- రెండేళ్లలో 6వేల మంది కాంట్రాక్టు కార్మికుల తొలగింపు
- 1800 మంది రెగ్యులర్ ఉద్యోగుల్నీ తీసేశారు
- ఎక్కడా లేని విధంగా ఉత్పత్తి ఆధారిత జీతాలు



**విశాఖపట్నం , జూన్ 09 ( మనం న్యూస్ ) :** దేశాన్ని ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసిన విశాఖ స్టీల్ ప్లాంట్ ఘటనలో మరణాలు ముమ్మాటికీ కూటమి సర్కార్ చేసిన హత్యలే అని, వీటిపై ప్రశ్నిస్తే మంత్రి లోకేష్ తీవ్ర అసహనానికి గురై కార్మిక సంఘాలపై నోరు పారేసుకుంటున్నారని వైఎస్సార్సీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ మండిపడ్డారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఘటనకు కారణాల్ని వెతకాల్సిన ప్రభుత్వ పెద్దలు,, నిస్సిగ్గుగా వైఎస్సార్సీపీపై విమర్శలకు దిగడం దారుణమని విశాఖలో మీడియాతో మాట్లాడుతూ గుడివాడ అమర్నాథ్ క్షేపించారు. స్టీల్ ప్లాంట్ లో ప్రమాదానికి బాధ్యత వహిస్తూ మృతుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రెస్ మీట్లో గుడివాడ అమర్నాథ్ ఇంకా ఏమన్నారంటే.. నిన్న విశాఖ స్టీల్ ప్లాంట్ లో జరిగిన ఘటన రాష్ట్ర ప్రజలతో పాటు దేశవ్యాప్తంగా అందరినీ ఆశ్చర్యపరిచింది. ప్రస్తుత టెక్నాలజీ యుగంలో, భారీ భద్రతా ప్రమాణాలు అందుబాటులో ఉన్న కాలంలో ఇంత మంది ప్రాణాలు కోల్పోవడం ఏంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మా వంతుగా మృతులు, బాధితుల కుటుంబ సభ్యుల్ని కలిసి ఓదార్చే ప్రయత్నం చేశాం. కనీసం మృతదేహాల్ని గుర్తుపట్టలేని పరిస్థితులు ఉన్నాయి. మృతుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ఇవ్వడంతో పాటు వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరాం. అలాగే క్షతగాత్రులకు 50 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని అడిగాం. కానీ ఇవాళ ముఖ్యమంత్రి కుమారుడు, షాడో సీఎం లోకేష్ స్టీల్ ప్లాంట్ బాధితుల పరామర్శకు వచ్చారు. ఆయన మాట్లాడిన తీరు చూసి ఈ ప్రాంతంలో ప్రజలు ముక్కున వేలేసుకున్నారు. ఆయన దేనికి వచ్చారు, రాజకీయాలు మాట్లాడటానికే వచ్చారా లేక బాధితుల్ని పరామర్శించేందుకు వచ్చారా అనేది తెలియడం లేదు. అలాగే కేజీహెచ్ లో కార్మిక సంఘాల నాయకులతోనూ అదే తీరున మాట్లాడారు. అందులో ఆయన ఫ్రస్టేషన్ అంతా కనిపించింది. ఆయన చేతకానితనం బయటపడటంతోనే ఫ్రస్టేషన్ పుట్టుకొచ్చినట్లు అర్ధమవుతుంది. ఆయన ఓ నియంతలా మాట్లాడారు. ఓ వ్యవస్థలో, సంస్థలో పనిచేసే తోటి వారికి ఏదైనా జరిగితే కుటుంబ సభ్యులతో సమానంగానే భావిస్తాం. మీ ఇంట్లో ఎవరైనా పోయారా అని లోకేష్ అడగడం దారుణం.

## కార్మిక సంఘాలపై రెచ్చగొట్టే మాటలేంటి ?

బాధితుల తరపున కార్మిక సంఘాలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే మీ సమాధానం ఇంత రెచ్చగొట్టేలా ఉండాలా ? ఓదార్చాల్సిన సమయంలో రెచ్చగొట్టే మాటలు మాట్లాడారు. కార్మిక సంఘాల్లో సీనియర్ నాయకుల్ని సైతం చులకనగా మాట్లాడారు. వాళ్లు కార్మిక సంఘాల్లోకి వచ్చే సమయానికి లోకేష్ పుట్టి కూడా ఉండడు. అధికారం ఉంది కదా అని వారిపై రెచ్చిపోయే మాట్లాడతారా ? విశాఖ ఉక్కు చరిత్రలో లోకేష్ వ్యాఖ్యలు, ఈ ప్రభుత్వం వ్యవహరించిన తీరు మాత్రం చెరిగిపోదు. దీన్ని అందరూ ఖండించాల్సిన అవసరం ఉంది. ఉత్తరాంధ్ర ప్రాంతంలో మీలా అందరికీ అక్రమ సంపాదన ఉండకపోవచ్చు కానీ ఇక్కడి కార్మిక నేతలకు ఆత్మగౌరవం మాత్రం ఉంటుంది. మీ తప్పిదాల వల్ల గత మాసాలుగా స్టీల్ ప్లాంట్ నిర్వీర్యం చేసే క్రమంలో జరిగిన ప్రమాదం ఇది. ఇవి ముమ్మాటికీ ఈ కూటమి ప్రభుత్వం హత్యలే. 2024లో కూటమి అధికారంలోకి వచ్చాక ఎప్పటి నుంచో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల్ని బలవంతంగా బయటికి పంపారు. ఉద్యోగుల్ని సైతం మెగా వీఆర్ఎస్ పేరుతో ఒత్తిడి తెచ్చి బయటికి పంపారు. ఈ రెండేళ్లలో 6 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల్ని బయటికి పంపారు. 1800 మంది రెగ్యులర్ ఉద్యోగుల్ని వీఆర్ఎస్ పేరుతో బలవంతపు రిటైర్మెంట్ ఇప్పించారు. 30 వేలు ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులు 15-16 వేలకు తగ్గిపోయారు. అంటే వారిపై పని ఒత్తిడి రెట్టింపైంది. దేశంలో ఎక్కడా లేని పద్దతుల్ని స్టీల్ ప్లాంట్ లో అమలు చేస్తున్నారు. ఉత్పత్తి ఆధారంగా జీతాలు ఇవ్వడం చేస్తున్నారు. దేశంలో ఏ ప్రభుత్వ రంగ సంస్థలో ఈ విధానం ఉందో చెప్పాలి. ప్రభుత్వ రంగ సంస్థల్లో ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులు ఉంటారు. ఎగ్జిక్యూటివ్ లో బదిలీలు ఉంటాయి. నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులు మాత్రం ప్లాంట్ లో ఉన్న యంత్రాలతో అనుబంధం ఉంటుంది కాబట్టి బదిలీలు చేయరు. కానీ మొదటిసారి గత మూడు నెలలుగా నాన్-ఎగ్జిక్యూటివ్ ఉద్యోగుల్ని కూడా బదిలీలు చేసేస్తున్నారు. ఈ మార్పులు చేర్పుల వల్ల ప్లాంట్ లో యంత్రాలపై ఉద్యోగులకు అవగాహన తగ్గిపోతుంది. మీ ప్రభుత్వం వచ్చాక చేతకాని తనం వల్ల చేస్తున్న మార్పులివి. హెచ్ఆర్ఏ, వైద్య సాయం వంటి సదుపాయాలు లేకుండా చేస్తున్నారు. ఎల్టీసీ సదుపాయం కూడా తీసేశారు. చివరికి ప్రాణాలకు భద్రత కూడా లేకుండా చేశారు. దానికి సమాధానం చెప్పలేక ఫ్రస్టేషన్ తో కార్మిక సంఘాలపై తిరగబడుతున్నారు. లోకేష్ తీరు ఏమాత్రం సరికాదు.

## పవన్ వి అవగాహన లేని మాటలు

ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు అసలు అవగాహన ఉందా లేదా కూడా తెలియడం లేదు. నిన్న జరిగిన ఘటనకూ గత ప్రభుత్వానికీ, జగన్మోహన్ రెడ్డి గారికీ ఏం సంబంధం ? ఈ రెండేళ్లలో కానీ, గతంలో కానీ ప్రధాని మోడీతో కానీ, కేంద్రంతో కానీ మాట్లాడి ఈ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయొద్దని అడిగారా ? తిరిగి ఇప్పుడు కార్మికుల్ని నిందిస్తున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ మాత్రమే కాదు దేశవ్యాప్తంగా ఉన్న విధానాలు చూడాలని గతంలో పవన్ చెప్పలేదా ? కార్మికులు ముందుకొస్తే పోరాటం చేస్తానని మరోసారి చెప్పారు.

కానీ ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి గారిపై అన్యాయంగా విమర్శలకు దిగుతున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై తొలిసారి ప్రకటన రాగానే...ఐదారు రోజుల వ్యవధిలోనే ప్రధాని మోడీకి జగన్మోహన్ రెడ్డి లేఖ రాశారు. ఈ ప్లాంట్ ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, దానికి చాలా ఆప్షన్స్ ఉన్నాయని, ఇది రాష్ట్ర ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని, 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న ప్లాంట్ అని ప్రధానికి గుర్తుచేశారు.

కానీ పవన్ కళ్యాణ్ ఏదైనా లేఖ రాస్తే చూపించాలి. 2022 నవంబర్ 12న విశాఖకు ప్రధాని మోడీ వస్తే.. అక్కడ కూడా జగన్మోహన్ రెడ్డి గారు వేదికపైనా ప్రైవేటీకరణ చేయొద్దని కోరారు. అదే సంవత్సరం కార్మిక సంఘాలు జగన్మోహన్ రెడ్డి గారిని కలిసి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేసి పంపాలని కోరితే.. అప్పట్లో తీర్మానం చేసి పంపారు. పరిశ్రమల మంత్రిగా గౌతంరెడ్డి ఉన్నారు. నేనూ అసెంబ్లీలో ఉండి స్టీల్ ప్లాంట్ కు వ్యతిరేకంగా ప్రసంగం చేసిన రికార్డులు ఉన్నాయి. అసెంబ్లీ తీర్మానాన్ని కేంద్రానికి పంపించాం.

## ప్రైవేటీకరణను అడ్డుకుంది జగనే

ఉక్కు శాఖ మంత్రిగా కుమారస్వామి బాధ్యతలు చేపట్టాక 2021 జనవరిలో తాము స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు నిర్ణయం తీసుకుంటే, అప్పట్లో ఆంధ్రప్రదేశ్ లో అధికారంలో ఉన్న ప్రభుత్వం అసెంబ్లీ తీర్మానం ద్వారా దీన్ని వ్యతిరేకించి పంపినట్లు చెప్పారు. జగన్మోహన్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉండగా ఒక్క కాంట్రాక్టు కార్మికుడిని అయినా, రెగ్యులర్ ఉద్యోగిని అయినా తీసేశారా, నెలలవారీ జీతం, బోనస్, వైద్య సదుపాయాలు ఆగిన సందర్భాలు ఉన్నాయా అనేది కార్మిక సంఘాల్ని అడిగితే తెలుస్తుంది. ఆ రోజు వైఎస్సార్సీపీ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంది కాబట్టే ఇప్పటికీ అది ముందుకెళ్లకుండా ఆగింది. కానీ పవన్ కళ్యాణ్ ఇవాళ జగన్మోహన్ రెడ్డి గారి మీద, వైఎస్సార్సీపీ మీద రాజకీయ ప్రసంగాలు చేస్తున్నారు. లోకేష్ మమల్ని టీమ్ లెవెన్ అంటున్నారు, ఆయన పార్టీ, కూటమి ఎలా గెలిచిందో అందరికీ తెలుసు కాబట్టి టీమ్ ఈవీఎం అనాల్సి ఉంటుంది. బీజేపీతో ప్రత్యక్షంగా, ఈసీతో పరోక్షంగా పొత్తు పెట్టుకోకపోతే మీకు ఇన్ని సీట్లు ఎలా వస్తాయి? లోకేష్ అధికార మదమెక్కి నీచంగా మాట్లాడుతున్నారు. సింహాచలంలో గోడ కూలిపోయి 8 మంది చనిపోతే లోకేష్ కు పెద్ద ఘటన కాదు, స్టీల్ ప్లాంట్ లో 8 మంది చనిపోతే అదీ పెద్ద ఘటన కాదు, తిరుపతిలో తోపులాట జరిగి ఆరుగురు చనిపోయినా మీకు పెద్ద ఘటన కాదు. ఇంకా ఎంత మంది పోతే మీకు ఇదో పెద్ద ఘటన అని అర్ధమవుతుంది. 14 వేల కోట్లు ఇచ్చి కాపాడామని చెప్పుకుంటున్న ప్రభుత్వం.. అవి ఇచ్చింది బ్యాంకులకు మాత్రమేనని అందరికీ తెలుసు. ఉద్యోగుల సంక్షేమానికో, ప్లాంట్ కోసమో మీరు రూపాయి ఖర్చుపెట్టలేదు. ఉద్యోగుల్ని తొలగించే వీఆర్ఎస్ కోసం ఆ డబ్బులు ఖర్చుపెట్టారు. ఇలాంటి సందర్భాల్లో అయినా నీచంగా రాజకీయాలు మాట్లాడొద్దని కోరుతున్నాం.

ఇప్పటికైనా మీరు చేసిన వ్యాఖ్యలకు కార్మిక సంఘాలకు, మృతుల కుటుంబాలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం. ఇవన్నీ మీ కూటమి ప్రభుత్వం చేసిన హత్యలే. 2012లో ప్రమాదం జరిగితేనే 25 లక్షలు ఇచ్చారు. మేం అధికారంలో ఉండగా ఎల్జీ పాలిమర్స్ ఘటనలో కోటి రూపాయలు పరిహారం ఇచ్చాం. ఇప్పుడు కేంద్రమంత్రి 25 లక్షలు ఇస్తామని చెప్పినా, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రూపాయి కూడా ప్రకటించలేదు. ఎట్టి పరిస్థితుల్లో మృతుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ప్రకటించాల్సిందే. రేపు వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ విశాఖకు వస్తున్నారు. నేరుగా ఎయిర్ పోర్టు నుంచి సెవెన్ హిల్స్, కిమ్స్ ఆస్పత్రులకు వెళ్లి బాధితుల్ని పరామర్శించి బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పబోతున్నారని గుడివాడ అమర్నాథ్ తెలిపారు.